నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, బుధవారం 5 మార్చి 2025 | SIDDIPET




సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం

# అడుగంటిన ఆశలు

## డెడ్ స్టోరేజీకి చేరువలో రిజర్వాయర్లు.. చెరువులు, కుంటల్లో తగ్గిన జలాలు

- పొట్ట దశలో నెర్రెలు బారుతున్న పొలాలు
- ప్రణాళిక లేని నీటి పారుదల శాఖ అధికారులు
- నిత్యం సాగునీటి కోసం రైతుల ధర్నాలు
- ఆందోళనలో రైతులు.. పట్టించుకోని ప్రభుత్వం
- సాగునీరివ్వాలని ప్రభుత్వానికి హరీశ్‌రావు లేఖ

*సిద్దిపేట రూరల్ మండలం అంకంపేట, సీతారాంపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయి. ఈ రెండు గ్రామాలే కాదు ఏ ఊరిలో చూసినా వరిపొలాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో ఎప్పుడూ చెరువుల్లో నీళ్లు ఉండేవి. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురుకాలేదు. ప్రస్తుతం చెరువులు, చెక్‌డ్యామ్‌లు, కాలువలే కాకుండా రిజర్వాయర్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. దీనికి తోడు బోరుబావుల్లో నీరు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో యాసంగి పంటలు గట్టెక్కడం కష్టమే అనిపిస్తున్నది.*

*'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు'.. అన్న నానుడి వాడుకలో ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అలాగే ఉంది. ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. సాగునీటి విడుదలలో ప్రభుత్వ తాత్సారం, ప్రణాళికాలేమి రైతుల పంటలు ఎండేలా చేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లు ప్రస్తుతం అన్ని ఖాళీ అవుతున్నాయి. నీటిని ఒక పద్ధతి ప్రకారంగా విడుదల చేయక పోవడంతో చెరువులన్నీ అడుగంటాయి. బీఆర్‌ఎస్ హయాంలో ఒక ప్రణాళిక ప్రకారం సాగునీటిని విడుదల చేసేవారు. ప్రతి చెరువును నింపడంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురుకాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి లేదు.*



సిద్దిపేట రూరల్ మండలం లక్ష్మీదేవిపల్లిలో ఎండిపోయిన వరి పొలం



సంగారెడ్డి జిల్లాలో ఎండిపోయిన సింగూరు కాలువ

సిద్దిపేట, మార్చి 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఇప్పుడే పంట పొలాలు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్లు ఉన్నా నీటిని సరిగా విడుదల చేయక పోవడం కారణంగా ఎక్కడికక్కడ చెరువులు నెర్రలుబారి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోరుబావుల్లో నీటి ఊటలు పూర్తిగా పడిపోయాయి. వరి పొట్ట దశలోకి వచ్చింది. ఈ సమయంలో తగినంత నీరు అందక ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 3 టీఎంసీ సామర్థ్యం కలిగిన రంగనాయక సాగర్‌లో ప్రస్తుతం 1.42 టీఎంసీల జలాలు మాత్రమే ఉన్నాయి. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నది. 30 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్న సాగర్‌లో ప్రస్తుతం 13.9 టీఎంసీలు, 15 టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండపోచమ్మ సాగర్‌లో 7.21 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వాయర్లకు అదనపు జలాలను పంపింగ్ చేస్తేనే ఆయకట్టు కింద పంట పొలాలు దక్కే అవకాశం ఉంటుంది. మిడ్‌మానేరు నుంచి నీటిని విడుదల చేసి రంగనాయక సాగర్‌కు, రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రణాళికా ప్రకారం ప్రభుత్వం నీటిని విడుదల చేయక పోవడంతో నీటి ఎద్దడి సమస్య ఉత్పన్నమవుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగునీటి కోసం నిత్యం రైతులు రోడ్డెక్కుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారుల తీరును రైతులు ఎండగడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సాగునీరు విడుదల చేసినారంటే క్రమ పద్ధతిలో అన్ని ప్రాంతాలకు నీళ్లు వచ్చేవని రైతులు చెబుతున్నారు. ఇవ్వాళ రైతులు ధర్నా చేస్తేనే నీటిని విడుదల చేస్తున్నారు. ఎక్కడ చూసినా సాగు నీటికి ఎదురు చూపులు తప్పడం లేదు. కొన్నిచోట్ల రైతులు పంట పొలాలు ఎండి పోవడంతో పశువులను మేపుతున్నారు. మరికొన్ని చోట్ల పంట పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

### బోరుబండ్లు, క్రేన్లకు డిమాండ్...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎక్కడ చూసినా బోరు బండ్లు కనిపించేవి. కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు బోరుబావులు తవ్వించే పరిస్థితి కాని, బావుల మీద క్రేన్లు కనిపించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ప్రస్తుతం పొలాలను రక్షించుకోవడానికి రైతులు బోర్లు వేయిస్తున్నారు. ఒక్కో రైతు రెండు మూడు అంతకన్నా ఎక్కువగానే బోర్లు వేయిస్తున్నారు. 700 ఫీట్ల వరకు బోరు తవ్వించినా నీరు రావడం లేదు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా బోరు బండ్లు కనిపిస్తున్నాయి. మరోవైపు బావుల పూడికతీతతో పాటు బావులను లోతు చేయిస్తుండగా రైతులు అప్పుల పాలవుతున్నారు. బోర్లలో నీరు రాక పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు.

### రెండెకరాల పొలం ఎండింది..



నాకున్న మూడెకరాల్లో యాసంగిలో వరిపంట వేసిన. మా ఊరి చెరువులో నీళ్లు రాకపోవడంతో రెండెకరాల పొలం ఎండింది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మా ఊరి చెరువులోకి మంచిగా నీళ్లు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మా చెరువు కింది పొలాలు ఎండిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎండిపోతుంటే మాకు కన్నీళ్లు వస్తున్నాయి.

– గజ్జల నరేశ్, రైతు, అంకంపేట

### మా చెరువులో నీళ్లు లేవు..



నాకు ఆరెకరాల పొలం ఉంది. యాసంగి పంటకు నీళ్లు రాకపోవడంతో నా పొలం నాలుగెకరాలు పూర్తిగా ఎండిపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మల్లన్న సాగర్ నుంచి మా చెరువులోకి నీళ్లు ఎప్పుడూ వచ్చేవి. చాలా ఏండ్ల పాటు మా చెరువు ఎండిపోలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్లకు, కరెంట్‌కు మాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు మోటర్లు కూడా కాలిపోతున్నయి.

–భగవాన్ రెడ్డి, రైతు, అంకంపేట

### పొలం పూర్తిగా ఎండిపోయింది..



మాది పూర్తిగా వ్యవసాయ కుటుంబం. మాకు ఐదెకరాల పొలం ఉంది. ప్రతి సారి యాసంగిలో వరి పంట సాగుచేస్తాం. ఈసారి సాగు చేసిన పంట నీళ్లు లేక పూర్తిగా ఎండి పోయింది. పెట్టుబడులు తడిసి మోపెడు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మా రైతులను నట్టేట ముంచింది.

– ఆకునూరి నర్సయ్య, రైతు, సీతారాంపల్లి



సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌లో ఎండిపోయిన బోయినికుంట చెరువు



సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసుజిపేటలో నీరందక ఎండిపోయిన పొలం



సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం తాడిదన్‌పల్లిలో నీరులేక ఎండిపోయిన వరిపొలం



సిద్దిపేట రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం

## ఎండిపోతున్న పొలాల పరిశీలన



మెదక్ జిల్లా గుజిరి తండాలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలిపిచెడ్, మార్చి 4: 'మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటాయి. మండలం మీదుగా మంజీరా నది వెళ్తున్నా ఈ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు'.. అని మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, వ్యవసాయాధికారులు స్పందించారు. గుజిరి తండాలోని ఎండిపోతున్న వరి పొలాలను కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. చండూర్ గ్రామ శివారులోని మంజీరా నది వద్ద ఉన్న ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి చెరువులు, కుంటలు నింపితే తమ బోర్లు బాగా నీరు పోస్తాయని గిరిజన రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని, చండూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఎందుకు మరమ్మతులు చేయించలేదని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ ద్వారా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి సాగునీరు అందించేందుకు కృషిచేస్తామని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ వెంట ఏఈవో కృష్ణవేణి, గుజిరి తండా మాజీ సర్పంచ్ రాకేశ్‌నాయక్, రైతులు ఉన్నారు.

## కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



రంగాయిపల్లి చెరువు వద్ద కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు, మార్చి 4: మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో తమ గ్రామాలకు కాళేశ్వరం జలాలు వచ్చాయని సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రంగాయపల్లి, విఠలాపూర్, కొత్తపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రంగాయిపల్లి చెరువు వద్ద గ్రామస్తులు గోదావరి జలాలకు హారతి పట్టి పూజలు చేశారు. అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.



రంగాయిపల్లి చెరువు వద్ద గోదావరి జలాలకు హారతి పడుతున్న మహిళలు

## కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతులకు కష్టాలు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



గజ్వేల్, మార్చి 4: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి విమర్శించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయం సంక్షోభంగా మారి అప్పుల బాధలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం గిరిపల్లిలో అప్పుల బాధతో తండ్రీకొడుకులు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ కుటుంబ రోడ్డున పడిందని, కనీసం అధికారులు బాధిత కుటుంబం వివరాలు సేకరించలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు లేక ఆత్మహత్యకు పాల్పడుతున్న రైతులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో కేసీఆర్ జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులను నిర్మించారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మండుటెండల్లో సాగునీరు అందించి రైతుల పంటలు కాపాడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు ఇవ్వకుండా రైతుల ఉసురుపోసుకుంటున్నట్లు ఆరోపించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటూ కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీటికి అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కాంగ్రెస్ నేతలు పదవుల కోసం కుమ్ములాడుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి డిమాండ్ చేశారు.

## గొట్టిముక్కుల శివారులో చిరుత సంచారం

పెద్దశంకరంపేట, మార్చి 4: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కుల గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతు ఎండీ గౌస్ పొలం వద్ద లేగదూడను కట్టేయగా, చిరుత దానిపై దాడిచేసి చంపేసింది. గ్రామస్తులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ధ్రువీకరించారు. గ్రామస్తులు రాత్రివేళ బయటకు ఒంటరిగా రావద్దని, పొలాల వద్దకు గుంపులుగా వెళ్లాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ సూచించారు. చిరుతను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు.



చిరుత దాడిలో లేగదూడ మృతిపై వివరాలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

## అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్, మార్చి 4: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 673లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారని, ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జాలకు పాల్పడితే కూల్చివేతలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిప్రసాద్ ఈ సందర్భంగా హెచ్చరించారు.



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ స్థలంలో కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

## పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు

- సినీ నటుడు, నంది అవార్డు గ్రహీత, ప్రముఖ మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రదీప్

చేర్యాల, మార్చి 4: విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యం నిర్దేశించుకొని ఏకాగ్రత, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సినీ నటుడు, నంది అవార్డు గ్రహీత, ప్రముఖ మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రదీప్ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మంగళవారం చేర్యాల శృంగేరి నగర్‌లోని సద్గురు సదనంలో శారదా సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీ ప్రదీప్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అవకాశం, ఆత్మవిశ్వాసం అనే రెండు రెక్కలను ఉపయోగించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం కోసం విద్యార్థులు శ్రమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అమ్మలాలన, మల్లెల వాసన, మట్టి వాసన, చంద్రుని వెన్నెల వంటివి అనుభవిస్తేనే వాటి గొప్పతనం తెలుస్తుందన్నారు. మొబైల్ జీవితంలో భాగమైందని, కానీ.. మంచి పనుల కోసం, పరిమితిమేర దానిని వినియోగించుకుంటే జీవితం బాగుంటుందని సూచించారు. విద్యార్థులు, యువత భావిభారత నిర్మాతలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి జీవితానికి బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సద్గురు సదనం నిర్వాహకులను కేవీ ప్రదీప్ ప్రశంసించారు. ఈ సందర్భంగా సద్గురు సదనం నిర్వాహకులు మాట్లాడుతూ.. నువ్వు నీకే కాదు, సమాజానికి సాయం చేయి అన్న లక్ష్యంతో సద్గురు సదనం పనిచేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో గుణాత్మక మార్పునకు విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాసర సరస్వతి ఆలయంలో పూజ చేయించబడిన ప్యాడ్స్, పెన్నుల సెట్లను సదనం నిర్వాహకులు విద్యార్థులకు అందజేశారు.




మాట్లాడుతున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రదీప్



హాజరైన విద్యార్థులు

## ఇస్నాపూర్‌లో కలుషిత నీరు సరఫరా

- బల్దియాలో గొంతెండుతున్న జనం
- వారంలో ఒక్కరోజు మాత్రమే తాగునీటి సరఫరా
- కలుషిత నీటితో రోగాలపాలు
- ఇస్నాపూర్ వాసులకు తాగునీటి తిప్పలు

పటాన్‌చెరు, మార్చి 4: సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కలుషిత నీరు సరఫరా అయ్యింది. తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ఇస్నాపూర్‌లో వారంలో ఒక రోజు మాత్రమే బల్దియా నీటిని సరఫరా చేస్తున్నది. మంగళవారం సరఫరా చేసిన తాగునీరు మురికిగా, లేత పసుపురంగులో ఉంది. దీంతో కాలనీవాసులు ఈ నీటిని బిందెల్లో పట్టుకోలేదు. ఇస్నాపూర్‌కు మిషన్ భగీరథ నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. అదే సమయంలో జనాభాకు సరిపోను నీరు పైనుంచి రావడం లేదని మున్సిపల్ నీటి పంపిణీని చూసే సిబ్బంది ఆ నీటిలో బోరునీటిని సంపులో తాగునీటితో కలిపి సరఫరా చేశారు. పరిశ్రమలతో ఇక్కడి భూగర్భజలాలు కలుషితం అయ్యాయి. ఈ నీటిని వాడుకోవడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధం విధించింది. అయినా మున్సిపల్ సిబ్బంది ఈ నీటినే పైనుంచి వస్తున్న మంజీరా నీటిలో కలిపి సరఫరా చేస్తున్నారు. పైగా పలు చోట్ల మురుగునీటి గుంటల్లోంచి ఈ పైప్‌లైన్లు వేయడంతో ఈ మురుగునీరు తాగునీటిలో కలుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటు కాలుష్యం నీరు, అటు మురుగునీరు కలుస్తుండడంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. నెలలో నాలుగైదు రోజులు మాత్రమే తమ కాలనీకి తాగునీరు సరఫరా అవుతున్నదని ఇస్నాపూర్‌వాసులు ఆరోపిస్తున్నారు.

### ముత్తంగిలో నెలకు నాలుగు రోజులే సరఫరా..

ముత్తంగి గ్రామాన్ని తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఆరునెలల క్రితం మున్సిపాలిటీలో కలసిన ముత్తంగి గ్రామస్తులకు తాగునీరు అందని ద్రాక్షగా మారింది. అటు మిషన్ భగీరథ సిబ్బంది నిర్లక్ష్యంతో పైనుంచి ప్రధాన లైన్ల ద్వారా నీటి సరఫరా తగ్గింది. మరోపక్క వచ్చిన నీటిని గ్రామంలో, దత్తాత్రేయకాలనీలో, న్యూటౌన్ కాలనీలో క్రమపద్ధతిలో సరఫరా చేయడం లేదు. పైనుంచి నీరు రావడం లేదని మున్సిపాలిటీ నీటి సరఫరా సిబ్బంది చెబుతున్నారు. మా పైప్‌లైన్‌ను రోడ్డు విస్తరణ కాంట్రాక్టర్ పగులగొడుతున్నాడని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. ఆరు నెలల నుంచి ముత్తంగికి వారంలో ఒక రోజు మాత్రమే తాగునీరు సరఫరా అవుతున్నది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మంగళవారం ఇస్నాపూర్‌లో నల్లాల్లో వచ్చిన అపరిశుభ్రమైన తాగునీరు

